# ప్రమాదభరితంగా లింగాల కాజ్‌వే

- ఇటీవలి వరదలకు దెబ్బతిన్న లింగాల కాజ్ వే
- తాత్కాలిక మరమ్మతులతో మమ
- మట్టిలో ఇరుక్కుపోతున్న వాహనాలు
- అవస్థల్లో వాహనచోదకులు
- హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రజల డిమాండ్



వరద తీవ్రతకు పూర్తిగా ధ్వంసమైన కాజ్‌వే(ఫైల్)



కాజ్ వే వద్ద రోడ్డుకు పడిన భారీ గొయ్యి

వత్సవాయి: చిల్లకల్లు–వైరా ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపై లింగాల వద్ద మునేటిపై ఉన్న కాజ్‌వే ప్రమాదభరితంగా మారింది. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలతోపాటు చత్తీస్‌గడ్ రాష్ట్రాలను కలిపే రహదారిలో ఎంతో కీలకమైన ఈ కాజ్‌వే ఇటీవలి వరదకు భారీగా దెబ్బతింది. కాజ్ వేను సుమారు 65ఏళ్ల కిందట నిర్మించారు. కాజ్‌వే తక్కువ ఎత్తులో ఉండటంతో వరద ఉధృతిని తట్టుకోలేక కొంతమేర కొట్టుకుపోయింది. దీంతో ఐదురోజులపాటు వత్సవాయి మండలంలోని 15 గ్రామాలకు నిలిచిపోయాయి. భారీ వర్షాలు, వరదల సమయంలో ఇదే పరిస్థితి ఉత్పన్నమవుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### నిత్యం వేలాది వాహనాల రద్దీ..

జగ్గయ్యపేట, చిల్లకల్లు సమీపంలో సిమెంట్ కర్మాగారాలు ఎక్కువ శాతం ఉండటంతో జాతీయ రహదారి తరువాత ఈ మార్గంలోనే వాహనాలు రాకపోకలు అధికంగా సాగుతుంటాయి. తెలంగాణ నుంచి బొగ్గు, బూడిదను తీసుకువచ్చి ఇక్కడ సిమెంట్ ఫ్యాక్టరీలలో అన్‌లోడింగ్ చేసే లారీలు.. ఇక్కడి ఫ్యాక్టరీల నుంచి సిమెంట్‌ను తెలంగాణలోని పలు ప్రాంతాలకు రవాణా చేస్తుంటాయి. ఈ వాహనాలన్నీ కూడా లింగాల కాజ్ వే మీదుగానే రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. ఇలా నిత్యం వేలాది వాహనాలు లింగాల కాజ్ వే మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి.

### భారీ వర్షాలకు రాకపోకలు బంద్..

భారీ వర్షాలు, మునేటికి వరదలు పెద్ద ఎత్తున వచ్చిన సందర్భంలో కాజ్‌వేపై వరదనీరు పారుతుండడంతో రాకపోకలు నిలిచిపోతుంటాయి. కాజ్‌వే తక్కువ ఎత్తులో ఉండటంతో సుమారు నాలుగైదు రోజులపాటు వాహనాల రాకపోకలు నిలిచిపోతూ వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. వరదలు తగ్గిన తరువాత కాజ్‌వేపై చెత్తాచెదారాన్ని తొలగించి మరలా రాకపోకల పునరుద్ధరిస్తుండటం పరిపాటిగా మారింది.

### దిగబడుతున్న లారీలు..

గతనెలలో మునేటికి మునుపెన్నడూ లేనంత స్థాయిలో వరదనీరు పోటెత్తడంతో లింగాల కాజ్‌వే పూర్తిగా దెబ్బతింది. రెండు చోట్ల రహదారి మొత్తం కొట్టుకుపోయింది. అంతేకాకుండా కాజ్‌వే పక్కన ఉన్న రక్షిత మంచినీటి పథకం పైపులైన్ కూడా కొట్టుకుపోయింది. దెబ్బతిన్న కాజ్‌వేను తాత్కాలికంగా మరమ్మత్తులు చేశారు. మట్టి, రాళ్లను వేసి రహదారి గండ్లను పూడ్చి రాకపోకలు సాగిస్తున్నారు. మట్టి పోసిన చోట వర్షం పడితే చిత్తడిగా మారి లారీలు ఇరుక్కుపోతుండటంతో వాహనదారులు పడుతున్న బాధలు వర్ణనాతీతం.


### తరచూ ప్రమాదాలు..

కాజ్‌వేకు ఇరువైపులా రక్షణగా ఉన్న దిమ్మెలు కూడా ఈ వరదలకు కూలిపోయాయి. దీంతో కాజ్ వేపై ప్రయాణం ప్రమాదభరితంగా మారింది. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఎదురుగా వచ్చే వాహనాల వెలుగుల్లో సక్రమంగా దారి తెలియడంలేదు. ఇటీవల ఖమ్మంకు చెందిన ఒక కారు అదుపుతప్పి మునేరులో పడింది. అదృష్టవశాత్తూ ప్రాణాపాయం తప్పింది. ప్రస్తుతం కాజ్‌వేపై పడిన గుంతల కారణంగా వాహనచోదకులు, ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

### హైలెవల్ బ్రిడ్జి నిర్మాణమే పరిష్కారం..

చిల్లకల్లు నుంచి తెలంగాణలోని వైరా వరకు జాతీయ రహదారిగా విస్తరించి మునేటిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేయడమే ఈ సమస్యను శాశ్వత పరిష్కారంగా చెప్పవచ్చు. మునేటిపై నూతన బ్రిడ్జి నిర్మించాలన్న ఈ ప్రాంత ప్రజల కోరికను దృష్టిలో ఉంచుకుని గతేడాది మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇక్కడ హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించింది. ఈలోగా ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో ఆ ప్రతిపాదనలు పక్కకుపోయాయి. లింగాల కాజ్‌వే మీదుగా ప్రయాణాలు సాగించే ప్రజాప్రతినిధులు, అధికారులు సైతం ఈ కాజ్ వే సమస్యను పరిష్కరించకపోవడంపై ఈ ప్రాంత ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇకనైనా పాలకులు స్పందించి మునేటిపై లింగాల వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### వర్షాల సమయంలో ఇబ్బందులు..



మునేటికి వరదలు వచ్చి కాజ్‌వేపై వరద నీరు వస్తే రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. తెలంగాణలోని ఖమ్మం, వైరా, తల్లాడ, సత్తుపల్లి, భద్రాచలం పలు ప్రాంతాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం. ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి.

–కనగాల రమేష్, మాజీ సొసైటీ అధ్యక్షులు, మక్కపేట

### హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేయాలి..



మునేటిపై పాత కాజ్‌వే స్థానంలో హైలెవల్ బ్రిడ్జిని నిర్మాణం చేయాలి. సుమారు ఆరు దశాబ్దాల కిందట నిర్మించిన కాజ్‌వే పూర్తిగా దెబ్బతిని ప్రమాదపుటంచున ఉంది. ఇప్పటివరకు తాత్కాలిక మరమ్మత్తులనే సరిపెడుతున్నారు. ఇకనైనా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

–వడ్డే పరమయ్య, సర్పంచ్, పెంట్యాల వారిగూడెం

## క్లుప్తంగా

### కృష్ణా పరీవాహక ప్రాంతాలు అప్రమత్తం



జగ్గయ్యపేట: శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తుండటంతో మండలంలో ముక్త్యాల సమీపంలోని పులిచింతల ప్రాజెక్ట్ నుంచి 1.90 వేల క్యూసెక్కుల నీటిని ఏడు గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేశారు. కృష్ణా పరీవాహక గ్రామాలైన ముక్త్యాల, రావిరాల, వేదాద్రి గ్రామాల ప్రాంత ప్రజలను ఆదివారం రెవెన్యూ, పోలీస్ అధికారులు అప్రమత్తం చేశారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని, ప్రజలు నదిలోకి వెళ్లకూడదని హెచ్చరికలు జారీ చేశారు. ముక్త్యాలలో నది ఒడ్డున ఉన్న భవానీ ముక్తేశ్వరస్వామి ఆలయం నీట మునిగింది.

### కేంద్రబృందం పర్యటన నేడు

చిల్లకల్లు(జగ్గయ్యపేట):మండలంలోని బూదవాడ, బలుసుపాడు గ్రామాల్లో బుధవారం కేంద్ర కమిటీ బృందం సోమవారం పర్యటించనుందని ఎంపీడీవో కార్యాలయ అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం ఎనిమిది గంటలకు బూదవాడ, మధ్యాహ్నం మూడు గంటలకు బలుసుపాడు గ్రామాల్లో కేంద్ర కమిటీ సభ్యులు పర్యటిస్తారని వివరించారు. గ్రామాల్లో పింఛన్లు, హౌసింగ్, గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు, గ్రామసభల పనితీరు తదితర అంశాలపై వారు అధ్యయనం చేస్తారని తెలిపారు.

### అభివృద్ధికి బాటలు : ఎమ్మెల్యే

చందర్లపాడు(నందిగామటౌన్): కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్లె పండుగ కార్యక్రమం గ్రామాల అభివృద్ధికి బాటలు వేస్తోందని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. పల్లె పండుగ–పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా చందర్లపాడు గ్రామంలో రూ. కోటి చేపడుతున్న అభివృద్ధి పనులకు నాయకులతో కలిసి ఆదివారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోందని వివరించారు. కార్యక్రమంలో నాయకులు కోట వీరబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న నాట్య ప్రదర్శన



వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలోని యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీ మువ్వ గోపాల కల్చరల్ ఆర్ట్ అకాడమీ(విజయవాడ) తిరుపతి అన్నమయ్య కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నర్తనోత్సవమ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు భరతనాట్యం, కూచిపూడి ప్రదర్శన నిర్వహించారు. ఉగ్రనరసింహ అవతారంలో చిన్నారులు చేసిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. అనంతరం ఆలయ ఈవో కానూరి సురేష్‌బాబు చిన్నారులను అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

### గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి

కంచికచర్ల : భూముల రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సోమవారం నుంచి నిర్వహించే గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కంచికచర్ల తహసీల్దార్ వి.జాహ్నవి ఆదివారం సూచించారు. ఈనెల 21వతేదీ సోమవారం పరిటాల, 23న పెండ్యాల, 24న పేరకలపాడు, 26న మున్నలూరు, 28వ తేదీన చెవిటికల్లు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. సర్వే కొలతలు, హద్దుల్లో ఏమైనా తేడాలుంటే తిరిగి రీసర్వే చేసుకునేందుకు గ్రామసభలో అర్జీలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వెంటనే మండల సర్వేయర్‌తో భూములను ఖచ్చితమైన కొలతలు, హద్దులతో రీ సర్వే చేస్తామని వివరించారు.

**వెల్లంకిలో పల్లెపండుగ**

వీరులపాడు(కంచికచర్ల): వీరులపాడు మండలం వెల్లంకిలో ఆదివారం పల్లె పండుగ కార్యక్రమానినిర్వహించారు. గ్రామంలో రూ.30లక్షల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణపనులకు భూమి పూజ చేశారు. టీడీపీ నాయకులు అబ్బాయి, సురేష్ పాల్గొన్నారు.

### బులియన్ మర్చంట్స్ సంఘ అధ్యక్షుడిగా 'గొల్లపూడి'

నందిగామటౌన్: ది నందిగామ జ్యూయలరీ అండ్ బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గొల్లపూడి వెంకటకృష్ణారావు, కార్యదర్శిగా కందుకూరి కృష్ణకుమార్‌లతో పాటు నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక ఎంజీ ప్యాలెస్‌లో అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అసోసియేషన్ నూతన అధ్యక్షుడు గొల్లపూడి వెంకటకృష్ణారావు మాట్లాడుతూ లాభాలే కాకుండా వినియోగదారుల మన్ననలు పొందేలా నడుచుకోవాలని సూచించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

### నేటి నుంచి గ్రామసభలు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట మండలంలో భూముల రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సోమవారం నుంచి నవంబర్ 4వతేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ నాగరాజు ఆదివారం తెలిపారు.ఈ సభల్లో వివిధ రకాల భూసమస్యల గురించి అర్జీలు స్వీకరిస్తామని ఆయన తెలిపారు. నిర్ణయించిన గ్రామాలలో ఉదయం 9 గంటల నుంచి జరుగు ఈ సభల్లో రైతులు, భూయజమానులు పాల్గొని తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలని తెలిపారు. ఈనెల 21వతేదీన షేర్‌మహ్మద్‌పేట, 23న బూచవరం(గండ్రాయి–2 సచివాలయం వద్ద), 24న రావికంపాడు, 25న రావిరాల, 29న బలుసుపాడు, 30న మల్కాపురం, నవంబర్ 1వ తేదీన గౌరవరం, 2న త్రిపురవరం, 4వ తేదీన కె.అగ్రహారంలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. గ్రామ సభల్లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ గ్రామసభలను భూయజమానులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

**పెనుగంచిప్రోలు మండలంలో..**

పెనుగంచిప్రోలు:మండలంలో భూము ల రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ఈనెల 21 నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శాంతిలక్ష్మి తెలిపారు. సోమవారం సుబ్బాయిగూడెం, 23న వెంకటాపురం, 24న గుమ్మడిదుర్రు, 25న లింగగూడెం, 26న తోటచర్ల గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు వివరించారు. గ్రామ సభల్లో భూమికి సంబంధించిన ఫిర్యాదులు, విస్తీర్ణంతో సహా అన్నిరకాల సమస్యలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించి 15రోజుల్లో పరిష్కరిస్తామని వివరించారు.

### నేడు రక్తదాన శిబిరం

పెనుగంచిప్రోలు: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం కంచికచర్ల మిక్ కళాశాలలో పోలీసు వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ ఎంఎస్‌కె అర్జున్ తెలిపారు. రక్తదానం చేసేందుకు ఆసక్తిగలవారు 08678-293233, 9440796463 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు. రక్తదాతల కోసం సోమవారం ఉదయం 7గంటలకు స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద బస్సు అందుబాటులో ఉంటుందని వివరించారు.

## అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



క్యూలైన్‌లో తీర్థప్రసాదాలు తీసుకుంటున్న భక్తులు

పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. భక్తులు అధికసంఖ్యలో తరలిరావటంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

### పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

నందిగామ టౌన్: పార్టీ పటిష్టతకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను సూచించారు. పట్టణంలోని పలువురు నియోజకవర్గ ఇన్‌చార్జి తంబళ్లపల్లి రమాదేవి ఆధ్వర్యంలో ఆదివారం జనసేన పార్టీలో చేరారు. ప్రభుత్వాస్పత్రి మాజీ చైర్మన్ గుడివాడ సాంబశివరావు, బెల్లంకొండ కొండలరావు, సూరపల్లి మధుకొండారి నాగయ్యలతో పాటు పార్టీలో చేరిన వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ జిల్లాల్లో పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని అంబారుపేటలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారికి ఆయన పూజలు చేశారు. అక్కడి నుంచి ర్యాలీగా వచ్చి గ్రామంలో ఏర్పాటు చేసిన జెండా దిమ్మెను ఆవిష్కరించారు. నాయకులు బొలియశెట్టి శ్రీకాంత్, మండలి రాజేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పొలాలను ముంచెత్తిన వర్షం



ముండ్లపాడు వద్ద మిర్చితోటలో నిలిచిన వర్షపునీరు



పెనుగంచిప్రోలు వద్ద తటాకాన్ని తలపిస్తున్న పత్తి చేను

పెనుగంచిప్రోలు: మండలంలో ఆదివారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. అప్పటివరకు ఎండకాయగా, ఒక్కసారి ఆకాశం మేఘావృతమై కుండపోత వర్షం కురిసింది. దీంతో పత్తి, మిర్చి తోటల్లో వర్షపు నీరు భారీగా చేరడంతో పొలాలు తటాకాలను తలపించాయి. వర్షాలతో మెట్ట రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# వివాదాస్పదంగా మారిన వైన్‌షాపుల ఏర్పాటు

- ఇష్టారీతిన వైన్‌షాపుల నిర్వాహకులు
- విద్యానంస్థలకు సమీపంలో షాపులు
- ఆందోళనలో విద్యానంస్థల ప్రతినిధులు
- ఎక్సైజ్ అధికారులు, ఎమ్మెల్యే సౌమ్యకు మహిళల ఫిర్యాదు



కంచికచర్లలో హైవే వద్ద విద్యాసంస్థల సమీపంలో ఏర్పాటు చేసిన మద్యంపాపు ఇదే



పేటలోని చిల్లకల్లు రోడ్‌లో విద్యాసంస్థలకు సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం షాపు



కీసరలోని మద్యంషాపు మందుబాబులు



కీసర గోదాన్‌లో ఉన్న మద్యం బాటిళ్లను కంచికచర్లకు తరలిస్తున్న దుకాణదారుడు

కంచికచర్ల/జగ్గయ్యపేటఅర్బన్/నందిగామటౌన్: మద్యం షాపుల లైసెన్స్‌దారులు ఇష్టారీతిన వ్యవహరిస్తూ ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న మద్యంషాపులు వివాదాలకు కేంద్ర బిందువుగా మారుతున్నాయి. పాఠశాలలు, ఆలయాల సమీపంలో మద్యంషాపులు ఏర్పాటు చేయరాదన్న నిబంధనను త్రోసిపుచ్చుతూ లైసెన్స్‌దారులు వారి వ్యాపారానికి అనువుగా ఉండే ప్రాంతాల్లోనే షాపుల ఏర్పాటుకు మొగ్గుచూపుతుండటంతో వివాదాలు చోటుచేసుకుంటున్నాయి.

**విద్యాసంస్థలకు సమీపంలో వైన్‌షాపు..**

జగ్గయ్యపేట పట్టణంలోని చిల్లకల్లు రోడ్డు నటరాజ్ థియేటర్ కూడలిలో మద్యం షాపు ఏర్పాటు చేయడం వివాదంగా మారింది. ఈ కూడలిలో విశ్వభారతి కళాశాల, వాగ్దేవి మహిళా డిగ్రీ కళాశాల, జేఆర్సీ కళాశాలలు ఉన్నాయి. సుమారు 3వేలమందికిపైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా, వీరిలో 2వేల మంది విద్యార్థినులు ఉంటారు. ఈప్రాంతంలో ప్రధాన రహదారికి ఆనుకుని గోల్డెన్ వైన్స్ పేరుతో మద్యంషాపును ఏర్పాటు చేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ మద్యంషాపు విశ్వభారతి కళాశాలకు 50 మీటర్ల దూరంలో, జేఆర్సీ కళాశాల 90 మీటర్ల దూరంలో ఏర్పాటు చేశారు. వాగ్దేవి మహిళా కళాశాల 100 మీటర్లకు పైగా దూరంలో ఉన్నప్పటికీ నిత్యం విద్యార్థినులు ఈమార్గం నుంచి రాకపోకలు సాగించాల్సి ఉండటమే విద్యార్థినుల తల్లిదండ్రుల ఆందోళనకు ప్రధాన కారణం. విద్యాసంస్థల కేంద్రంగా ఉన్న ఈ కూడలిలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం తగదంటూ ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు ఇప్పటికే ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశాయి.

**కూటమి నాయకుల మధ్య కోల్డ్‌వార్ ..**

కీసరలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తమకు సంబంధించిన షాపుల్లో పెట్టాలని టీడీపీ నాయకులు..మద్యంషాపులో పనిచేసేందుకు మా అనుచరులను పెట్టుకోవాలని జనసేన నాయకులు పట్టుపడుతూ మద్యంషాపు నిర్వాహకుడిపై ఒత్తిడి చేస్తున్నారు. దీంతో ఇరుపార్టీల నాయకుల ఒత్తిడిని తట్టుకోలేక టీడీపీ నాయకుడైన సదరు మద్యం షాపు నిర్వాహకుడు కీసరలో షాపును నిర్వహించలేనంటూ అక్కడి గోడౌన్‌లోని సరుకును ఆదివారం కంచికచర్లకు తరలించారు. మద్యంషాపులోని సరుకు విక్రయాలు కూడా పూర్తయితే షాపును మూసివేస్తారనే ప్రచారం సాగుతోంది.

**ఎమ్మెల్యే సౌమ్యకు ఫిర్యాదు..**

కంచికచర్లలో హైవే పక్కనే విద్యాసంస్థలకు అత్యంత సమీపంలో ఏర్పాటు చేయడంతో విద్యాసంస్థల ప్రతినిధులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. సంస్కృతి విద్యామందిర్, కేవీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, శ్రీచైతన్య పాఠశాలల సమీపంలో ఏర్పాటు చేసిన ఈ మద్యంషాపును వెంటనే అక్కడ్నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆయా విద్యాసంస్థల ప్రతినిధులు ఇప్పటికే నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకు వినతిపత్రం అందజేశారు.

**నందిగామలో ముదిరిన వివాదం..**

నందిగామలోని పాతబస్టాండ్ సమీపంలో రామలింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన భూమిలో మద్యంషాపు ఏర్పాటు చేయగా, ఆలయ అధికారి అభ్యంతరం వ్యక్తంచేశారు. దీంతో మద్యం షాపు నిర్వాహకులు, ఆలయ అధికారికి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈస్థలంలో ఆలయ భూమి అయినందున మద్యంషాపు ఏర్పాటు చేయరాదంటూ శుక్రవారం రాత్రి ఆలయ అధికారి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయగా, శనివారం ఉదయం లైసెన్స్‌దారులు ఆబోర్డును తొలగించి యధావిధిగా మద్యంషాపును నిర్వహిస్తుండటంతో ఈ వివాదం మరింత ముదిరింది. ఇలా జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లోని ఈ మద్యం దుకాణాల ఏర్పాటు అంశం పలు వివాదాలకు దారితీసింది.

### అన్నపూర్ణ సేవాసమితి సేవలు స్ఫూర్తిదాయకం



జగ్గయ్యపేట అర్బన్: ఎంతో మంది నిరుపేదలకు, అన్నార్తులకు ఆకలిని తీర్చే పుణ్యకార్యాన్ని నిర్వహిస్తున్న అన్నపూర్ణ సేవా సమితి వారి సేవలు స్ఫూర్తిదాయకమని తాత్వికులు, బలుసుపాడు శ్రీగురుధాం వ్యవస్థాపకులు శివశ్రీ గెంటేల వెంకటరమణ అన్నారు. అన్నపూర్ణ సేవాసమితి వారి 10వ వార్షికోత్సవం సందర్భంగా అన్నదాన కార్యక్రమాల్లో సేవలందిస్తున్న వలంటీర్లను తాత్వికులు గెంటేల వెంకటరమణ, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ఘనంగా సన్మానించారు. సేవాసమితి వ్యవస్థాపకులు మహంకాళి జయప్రకాష్ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొగ్గవరపు రాజారావు, షరాబువర్తక సంఘం గౌరవాధ్యక్షుడు శ్రీరాం రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కొంకిమళ్ల మల్లికార్జునరావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నూకల కుమార్‌రాజా, ఏఎంసీ మాజీ డైరెక్టర్ నూకల బాలకృష్ణ, నందిగామ అన్నపూర్ణ సేవాసమితి అధ్యక్షుడు పారేపల్లి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.



జగన్నాథపురం గ్రామ సమీపంలోని మలుపు



జుజ్జూరులో ప్రమాదకరంగా ఉన్న మలుపు

### ప్రమాదకరంగా మలుపులు



వీరులపాడు తోటమూల వద్ద ప్రమాదాలకు నిలయంగా ఉన్న వై ఆకారంలోని మలుపు

వీరులపాడు: ఆయా గ్రామాలను కలిపే ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ రహదారులపై ఉన్న మూలమలుపులు ప్రమాదాలకు నెలవుగా మారాయి. సూచికలబోర్డులు కూడా లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మండలంలోని జగన్నాధపురం, జుజ్జూరు, అల్లూరు, పెద్దాపురం, వీరులపాడు, కొణతాలపల్లి, బోడవాడ, జమ్మవరం గ్రామాల్లోని రోడ్ల మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో వాహనచోదకులు గాయాలపాలవుతున్నారు. ఇకనైనా అధికారులు ఆయా మూలమలుపుల వద్ద సూచికల బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

### గ్రామోత్సవం



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో వేంచేసియున్న శ్రీసత్యమ్మ తల్లి ఆలయం వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలరథంపై అలంకరణ చేసి కోలాట నృత్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సాంబయ్య, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.